క్లుప్తంగా

త్రైత సిద్ధాంత పుస్తకాలు పంపిణీ

ఫిరంగిపురం: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని పొనుగుపాడు, గుండాలపాడు, మునగపాడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సభ్యులు ఎ.రమేష్, పోతురాజు, పి.రామయ్య, కె.చిన్న వెంకయ్య, పి. ఏడుకొండలు, భాస్కరరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మంగళగిరి: వేసవి దాహార్తిని తీర్చేందుకు నగర పరిధిలోని యర్రబాలెం శివాలయం సెంటర్‌లో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. యర్రబాలెంకు చెందిన లేళ్ల నరసింహారావు- ఝాన్సీ దంపతుల కుమారుడు పరిక్షిత్ నాగసాయి జన్మదినం సందర్భంగా బాటసారులకు, వాహనదారులకు వంద లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల సాయి, వల్లంశెట్టి నాని, మక్కే కిరణ్, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో గ్రావెల్ రోడ్ నిర్మాణం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో కార్పొరేషన్ అధికారులు మరో రోడ్డు నిర్మాణాన్ని సోమవారం చేపట్టారు. ఉండవల్లి దళితవాడలో లంక బాబూరావు ఇంటి దగ్గర నుంచి పట్నం రజని ఇంటి వరకు 40 మీటర్ల పొడవున 12 అడుగుల వెడల్పున రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎ.ఇ.కిషోర్ తెలిపారు. ఆ ప్రాంతంలో నివాసాలు ఏర్పడినప్పటి నుండి ఎటువంటి రోడ్డు నిర్మాణం జరగలేదని, స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేకు వినతి పత్రం ఇవ్వడంతో ఆయన సూచనల మేరకు గ్రావెల్ రోడ్ నిర్మాణం చేపట్టామని, త్వరలోనే సిమెంట్ రోడ్ , డ్రైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఏఈ చెప్పారు.

పాస్టర్‌పై అసత్య ఆరోపణలు తగదు

మంగళగిరి: నగరానికి చెందిన పాస్టర్ మృత్యుంజయుడుపై అసత్య ఆరోపణలు చేయడం తగదని పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పి.తిమోతి అన్నారు. నగరంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన డబ్బులు తీసుకున్న వ్యవహారంలో మృత్యుంజయుడుకు ఎలాంటి సంబంధం లేకపోయినా మోసం చేశాడని తప్పుడు ఆరోపణలతో వరలక్ష్మి అనే మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. వాస్తవానికి ముంతాజ్, వరలక్ష్మి ఇద్దరూ స్నేహితురాళ్లని, వారి వివాదంలో పాస్టర్ మృత్యుంజయుడును ఇరికించి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. సమావేశంలో మెట్రో రీజన్ పాస్టర్స్ ఫెలోషిప్ కన్వీనర్ బి.రవి ప్రకాష్, ఏవీఎస్ మణి, పాస్టర్ మృత్యుంజయుడు, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ గుండిమెడలో భార్యపై అనుమానంతో ఓ భర్త విచక్షణా రహితంగా దాడితో ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్ఐ రమేష్ సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గుండిమెడ గ్రామానికి చెందిన గోసా రెబికాకు, అనిల్‌తో 8 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరిద్దరి ఇద్దరు మగపిల్లలు. తాపీపని చేసే అనిల్ మద్యానికి బానిస కావడంతో రెబికా ఇంటిదగ్గర మిషన్ కుడుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. వడ్డేశ్వరంలో అనిల్ సోదరి ఇంట్లో ఫంక్షన్ జరుగుతుండగా రెబికా ఆ ఫంక్షన్‌కు వెళ్లలేదు. ఇంటికి వచ్చిన అనిల్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ ఎవరికోసం ఇంటిదగ్గర ఉన్నావంటూ రెబికాపై కర్రతో దాడికి పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన రెబికాను వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళామని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



తెనాలి: గుంటూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పి.వి.కోటేశ్వరరావు కార్యదర్శిగా ఎస్.నిరంజన్‌రావు ఎన్నికయ్యారు. స్థానిక బాలాజీరావు పేటలోని ఘంటా హనుమయ్య సత్రంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో 2023–2027 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జె.సింగారావు, జి.ఎస్.రామకృష్ణ, కె.రవిశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, డి.కృష్ణప్రసాద్, జి.వెంకటనారాయణ, వి.సురేష్‌బాబు, టి.రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.కె.ఎస్. విజయ్‌చంద్, ఎస్.ఏడుకొండలురెడ్డి, బి.హైమారావు, కోశాధికారిగా జె.మహినాథ్‌తో పాటు మరో 11 మంది కార్యవర్గసభ్యుల్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జి.గోపీచంద్, చీఫ్ పాట్రన్స్‌గా డి.నరేంద్రకుమార్, ఎల్‌వీఆర్ అండ్ సన్స్ గుంటూరును ఎన్నుకున్నారు. పరిశీలకులుగా ఏపీ వాలీబాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సి.మాలకొండయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ
- నగరంలో విస్తృతంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



నిడమర్రులో కరపత్రాలను అందజేస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

మంగళగిరి: అర్హులైన పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు అన్నారు. నగరంలోని పాత మంగళగిరి, నిడమర్రులో జగనన్నే మా భవిష్యత్... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలకు అరకొరగా సంక్షేమ పథకాలను అందించి జన్మభూమి కమిటీల పేరుతో దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసి అసలైన లబ్ధిదారులకు కాకుండా టీడీపీ కార్యకర్తలకు, వారి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ప్రజలకు మాత్రమే అందించారని దుయ్యబట్టారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వ పాలన కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న సంక్షేమం గురించి ప్రజలకు వివరించి 82960 82960కు ఇంటి యజమానుల చేత మిస్డ్ కాల్ ఇప్పించి స్టిక్కర్స్‌ను అంటించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల చంద్రశేఖర్, అంజి, రాజ్యలక్ష్మిలతో పాటు వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. నగర పరిధిలోని 15,20వ సచివాలయం, ఆత్మకూరు, కాజ, నిడమర్రు తదితర ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, బొమ్ము సాంబిరెడ్డి, గాలి సాంబయ్య, కొల్లి శేషిరెడ్డి పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్నబత్తుల, కత్తెర సురేష్ కుమార్



తాడేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వేణుగోపాల సోమి రెడ్డి

మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లు ఆవిష్కరణ

తాడికొండ: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్ స్టిక్కర్‌లను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. గుంటురులోని నియోజకవర్గ కార్యాలయంలో మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల కార్‌లకు మా నమ్మకం నువ్వే జగన్ అని రాసి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖచిత్రం ఉన్న స్టిక్కర్‌లను అంటించి ఆవిష్కరించారు.

అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే సారథ్యంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదులమూడి డేవిడ్ రాజు, వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయని, ముగ్గు రోడ్డులో కొండపై నివసించేవారికి తాగు నీటిని అందిస్తున్నామని, త్వరలోనే కృష్ణాజలాలు కూడా తీసుకు వస్తామని, ఇంటింటికి తిరుగుతున్న సమయంలో ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు నేరుగా మాకు అందుతున్నాయని, మాకు ఏ అవసరం ఉన్నా గతంలో అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వలంటీర్లు మా ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ తాడేపల్లి పట్టణ నాయకుడు ముదిగొండ ప్రకాష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్ కుమార్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం గుంటూరు భారత్‌పేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. చిన్నపాటి లోపాలుంటే సరిదిద్దుకొని పార్టీ బలోపేతానికి ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి సమష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల నిర్వహణకు నాయకులు, కార్యకర్తలు అందిస్తున్న సహకారం బాగుందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామాల్లో పక్కాగా ప్రతి ఇంటికీ తిరిగి ఆ గృహంలో జరిగిన లబ్ధి, అభివృద్ధిని వివరించడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలని సూచించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఎంపికైన 12 మంది లబ్ధిదారులకు రూ.12.30 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న, జెడ్పీటీసీలు కందుల సిద్దయ్య, గుడిమెట్ల జ్యోతి, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సాంబశివరావు మృతుడు

తాడికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి చెందిన ఘటన తాడికొండ శివారు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. వివరాలు.. సోమవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైక్‌పై వెళుతున్న కుక్కమళ్ళ సాంబశివరావు(38) ఆటోను ఓవర్ టేక్ చేయబోయే సమయంలో కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆటోలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు తాడికొండ గ్రామానికి చెందిన వ్యక్తి కాగా రాడ్ బెండింగ్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. మృతుడికి ఒక బాబు, పాప ఉన్నారు.

మహిళపై వడ్డీ వ్యాపారి దాడి

మంగళగిరి: అధిక వడ్డీలను వసూలు చేస్తూ మహిళపై దాడికి పాల్పడిన వడ్డీ వ్యాపారిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాలు... నగర పరిధిలోని చినకాకానికి చెందిన గండికోట దుర్గారావు అదే ప్రాంతానికి చెందిన ముద్రబోయిన నాగమణికి రూ.1.50 లక్షలు వడ్డీకి ఇచ్చాడు. సంవత్సరానికి రూ.1.50 లక్షల వడ్డీ అంటూ రూ.3లక్షలకు తిరిగి నోటు రాయించుకున్నాడు. అనంతరం రెండు సంవత్సరాలకు రూ.6లక్షల వడ్డీ అని మరలా తిరిగి నోటు రాయించుకున్నాడు. నాగమణి ఇంకో సంవత్సరంలో బాకీ తీరుస్తానని చెప్పగా వెంటనే చెల్లించాలంటూ ఆదివారం నాగమణి నిర్వహిస్తున్న కిరాణా దుకాణం వద్దకు వెళ్లి గొడవ చేసి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దుర్గారావును పిలిపించి విచారించేందుకు కానిస్టేబుల్‌ను పంపించగా తాను విలేకరినంటూ, పోలీసుల వద్దకు తాను రానని బెదిరింపులకు దిగాడు. అయితే దుర్గారావు గతంలోనూ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహించి వివాదం నేపథ్యంలో ఉద్యోగం కోల్పోగా దుర్గారావుపై పోలీసులకు పలు ఫిర్యాదులు అందాయి.

జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అనూరాధ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ దాసరి అనూరాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొనుగుపాడు, నుదురుపాడు, బేతపూడి, ఫిరంగిపురం, మునగపాడు గ్రామాల్లో 16 ఎకరాల 32 సెంట్లలో పాఠశాలలు, క్రీడా మైదానాలు ఉన్నాయని చెప్పారు. వాటికి సంబంధించి స్థలాలు ఆక్రమణకు గురి అయినాయా లేక రక్షణలో ఉన్నాయనే వివరాలు ఆయా గ్రామాల కార్యదర్శులు సేకరించి స్థలాలకు రక్షణగా కంచెలు ఏర్పాటచేసి జిల్లాపరిషత్ ఆస్తులు అంటూ ప్లేకార్డులు వేయించాలని వాటి వివరాలు వారంలోగా తెలియజేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ పద్మనాభుడు, ఈఓపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి, పీఆర్ ఏఈ జోజప్ప, కార్యదర్శులు కె.విష్ణువర్ధనరావు, పి. శౌరి జోజి.శౌరికుమారి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



రేవేంద్రపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంగళగిరి: నియోజకవర్గ పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగకుండా ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలనే విషయమై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం



దేవానంద్‌కు పుస్తకాలు అందజేస్తున్న రచయిత గోపాలరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తి నుంచి భారతదేశ అత్యున్నత పీఠమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. సోమవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మట్లాడుతూ ప్రథమ ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతిగా భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టిన రాధాకృష్ణన్ దేశానికి ప్రపంచ దేశాల్లో గుర్తింపు తెచ్చారని తెలిపారు. రెండుసార్లు ఉప రాష్ట్రపతి పదవితో పాటు రాష్ట్రపతిగా చైనా, పాకిస్తాన్ యుద్ధ సమయంలో ప్రధానులకు మార్గ నిర్దేశం చేశారని వివరించారు. అనంతరం రచయిత ఉప్పల గోపాలరావు రచించిన 'ఒక సామాజిక స్పృహ గల కార్యకర్త ఆలోచనలు-అభిప్రాయాలు', 'నా మాటల మూట' అనే రెండు పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యం.సీతారామయ్య, లైబ్రేరియన్ కె.చిన్నపరెడ్డి, యన్.నాగిరెడ్డి, టైపిస్టు కె.శ్రీనివాసరావు, జి.రాజేష్, జూనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసులు, యం.సంజయ్, కె.పూర్ణచంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఈనెల 19న అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు బీకాం, బీఎస్సీ, బయాలాజికల్ సైన్స్, బీ ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వస్తు సేవల పన్ను ప్రభావంపై బీకాం విద్యార్థులకు, ఆరోగ్య నిర్వహణ, పునర్వ్యవస్థీకరణలో పోషణ–ఆహారం పాత్రపై బీఎస్సీ బయాలాజికల్ సైన్సెస్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9703284136, 9440886535 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- మోతడకలో గడప గడపకు మన ప్రభుత్వం



మోతడకలో పథకాల లబ్ధిని వివరిస్తున్న పార్టీ అదనపు సమన్వయకర్త సురేష్ కుమార్

తాడికొండ: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తూ గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తాడికొండ మండలం మోతడక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ లబ్ధిని వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి గడపకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయనడానికి గ్రామాల్లో వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. ప్రజాదరణ చూస్తే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో రాబోయే ఎన్నికల్లో 175కి 175 సీట్లు సాధించడం సుసాధ్యమే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, పార్టీ గ్రామ అధ్యక్షుడు నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు వెంకటయ్య మాస్టార్, యడ్లపల్లి శ్రీ ధర్, స్థానిక నాయకులు బోయపాటి సాంబశివరావు, చాగంటి కోటయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ రోడ్డు నిర్మాణం



వడ్డేశ్వరం కమ్యూనిటీ హాల్‌కు గ్రావెల్ తోలుతున్న వాహనాలు

తాడేపల్లి రూరల్: నగర పరిధిలో వడ్డేశ్వరంలో వైఎస్సార్ సీపీ నాయకులు కత్తిక మల్లికార్జునరావు(బుల్లబ్బాయి) 15 ఏళ్ల క్రితం కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేశారు. ఆ కమ్యూనిటీ హాల్‌కు చుట్టూ ప్రహరీ నిర్మించాలని స్థానికులు అడగడంతో ప్రహరీ నిర్మించారు. ఎమ్మెల్యే ఆర్కే పనులను పరిశీలించేందుకు వచ్చిన సమయంలో కమ్యూనిటీ హాల్‌కు రోడ్డు, కల్వర్ట్ నిర్మాణం, గ్రావెల్ ఫిల్లింగ్ చేయాలని స్థానికులు కోరడంతో అడిగిన వెంటనే ఆయన స్పందించి సోమవారం నుంచి కమ్యూనిటీ హాల్ ఆవరణలో గ్రావెల్ ఫిలింగ్‌తో పాటు, 400 మీటర్ల పొడవున 3 మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మాణం చేపట్టారు. కమ్యూనిటీ హాల్‌కు, రోడ్డుకు మధ్యలో భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా కల్వర్టు నిర్మాణం చేపట్టారు.

వీఐటీ వర్సిటీలో ప్రవేశ పరీక్ష ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర

తాడికొండ: వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయంలో వీఐటీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష వీఐటీ ఈఈఈ-2023 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. 17- 23వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మూడు స్లాట్లలో ఉదయం 9 గంటలు, 12.30, 4 గంటలకు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 125 నగరాలు, విదేశాలలో 4 నగరాలలోని పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు హాజరవుతున్నారని, ఫలితాలు ఈ నెల 26న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుననట్లు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ జగదీష్ చంద్రగంటి తెలిపారు.

ప్రకాశం బ్యారేజ్ రెయిలింగ్‌కు హంగులు



ప్రకాశం బ్యారేజ్ రెయిలింగ్‌కు వేస్తున్న రంగులను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లి రూరల్: కృష్ణానది ప్రకాశం బ్యారేజ్‌పై ఇరువైపులా ఉన్న రెయిలింగ్‌కు కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం రంగులు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రకాశం బ్యారేజ్‌కు ఇరువైపులా ఉన్న రైయిలింగ్ గోడకు ఉన్న పెయింట్లు పూర్తిగా పోవడంతో విజయవాడ నగరపాలక సంస్థ, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ వారు సంయుక్తంగా రూ.3.50 లక్షలు కేటాయించి పెయింటింగ్ నిర్వహిస్తున్నట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



నిడమర్రు బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు

మంగళగిరి: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లత తెలిపారు. నగర పరిధిలోని నిడమర్రులో సోమవారం బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ లత మాట్లాడుతూ బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, లింగ వివక్షతలు రూపు మాపడానికి విలేజ్ లెవల్ ప్రొటెక్షన్ కమిటీలు ఎన్నుకోవడం జరిగిందన్నారు. నిడమర్రు ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షురాలిగా మహిళా పోలీస్ సత్య, సెక్రటరీగా అంగన్‌వాడీ టీచర్ జ్యోతితో పాటు ప్రతినిధులుగా ఆశ వర్కర్ ఉష, యానిమేటర్ ఎస్తేరు రాణి, వలంటీర్ లక్ష్మితో పాటు 12 మందితో కమిటీని నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నేలటూరి నాగమణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ దుర్గారావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణలంక పీఎస్ ఆవరణలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.వి.దుర్గారావు కేసు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి సెంటర్ కేఎల్ రావు నగర్‌లో నివాసం ఉంటున్న వల్లూరి రోజా చుట్టు పక్కల ఇళ్లల్లో పాచిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె భర్త రవికుమార్ 11 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. వీరికి ఒక పాప. వచ్చే డబ్బు సరిపోకపోవడంతో అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రోజా తన మరిది వల్లూరి సుబ్రహ్మణ్యంతో కలసి గంజాయిని విక్రయించడం ప్రారంభించారు. వారిద్దరూ వైజాగ్, అరకు పరిసర ప్రాంతాలకు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి యువతకు, కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. వీరిపై గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. గతంలో గంజాయిని విక్రయించిన సుభాష్‌కుమార్, విశ్వకర్మ, రాజ్‌కుమార్ సింగ్‌లను అరెస్ట్ చేసి విచారించగా వల్లూరి రోజా, సుబ్రహ్మణం వద్ద నుంచి గంజాయిని కొనుక్కొని వచ్చామని చెప్పారు. ప్రత్యేక సమాచారం మేరకు వైజాగ్ వెళ్లేందుకు సిద్ధమై బస్టాండ్ వద్దకు వచ్చిన నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దుర్గారావు తెలిపారు.